ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



## (పాలకొల్లు లో శ్రీ నాన్నగారి ప్రవచనము, 23-11-97)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

ఈశ్వరుడు అంటే ఈ సృష్టికి ప్రభువు ఆయన సర్వసాక్షి, సర్వజ్ఞుడు. ఈసృష్టిని అంతా ఈశ్వరుడు చూస్తాడు. ఈశ్వరుడిని మనం చూడలేము, కాబట్టి ఆయన లేడు. అనుకుంటుంన్నాము. యధార్ధంగా ఆయన ఉన్నాడు, మనం లేము. జీవులను ప్రారబ్దమునను సరించి ఆడించేవాడు ఈశ్వరుడు. ఈ సృష్టి అంతా ఆయనదే. మనం ఇతరులకు ఎవరికైనా సహకారం చేస్తున్నామంటే ఆ సొత్తు కూడా ఆయనదే. అది మనకు తెలియక మనది అని గర్వపడుతున్నాము. పరమేశ్వరుడు మనకు ఇస్తే మనం ఇతరులకు ఇవ్వగలుగుతున్నాము. పరమేశ్వరుడు మనకు ఇవ్వకపోతే మనం పెద్ద సున్నలతో సమానము. పరమేశ్వరుడు యొక్క సహకారము లేకపోతే మనవలన ఏమీకాదు. అంతా ఆయన అనుగ్రహమే. తెగిపోయిన గాలిపటంలా జీవుడి చరిత్ర ఉండదు. ఈశ్వరుడు జీవులను ప్రారబ్ధానుసారం ఆడిస్తాడు. గురువు కూడా ప్రారబ్ధమును అనుసరించే లభిస్తాడు. మహాత్ములు, గురువులు చాలామంది ఉంటారు. జన్మాంతర అనుబంధమును బట్టి ఏగురువు ద్వారా ఏజీవులు తరించాలో ఆగురువుకి ఆజీవులను ఈశ్వరుడు కేటాయిస్తాడు. మన మనస్సు పక్వానికి వచ్చినప్పుడు, అర్హత కలిగినప్పుడు మనలోపల ఉన్న ఈశ్వరుడే మానవరూపం ధరించివస్తాడు. మానవుడుగా వస్తాడు, కాని వాడే దేవుడు అది మనం మర్చిపోకూడదు. ఇది గుర్తించినవాడు ధన్యుడు. ఏగురువుద్వారానైనా తరించవచ్చును. సజీవమైన విశ్వాసం ఉండాలి. నామము, రూపము ముఖ్యంకాదు, తరించటం ముఖ్యము.

ప్రారబ్ధము, కర్మ ఇవిఅన్ని దేహబుద్ధికి సంబంధించిన విషయములు. వీటి దగ్గర ఆగిపోకూడదు. అసలు వస్తువును పట్టుకోవాలి, మన గురి అక్కడ పెట్టాలి. నేను సాధన బాగా చేస్తున్నాను. అనుకోవడం వలన ఈశ్వరుడు వేరు, నేను వేరు అనుకొంటున్నాము. ఉన్నది ఆయనే అంతా ఆయన అనుగ్రహమే. మనచేత సాధన చేయించేది ఆయనే, మర్చిపోకండి. ఏపని జరిగినా ఆయన సంకల్పమే. అసలు మనం లేనేలేము. అహంకారము వలన నేను ఉన్నానని అనుకొంటున్నావు. ఉన్నది ఒకటే అయితే ఇలా రకరకాలుగా ఎందుకు కనిపిస్తున్నాయి. అని అడిగితే నీకు ఉన్న ఉపాధి బుద్ధి వలన ఇలా కనిపిస్తోంది. రంగులు వేరుగా ఉంటాయి. గుణాలు వేరుగా ఉంటాయి. ఈరంగులు అన్నీ దేహానికి సంబంధించినవే, గుణాలన్ని మనస్సుకు సంబంధించినవే. లోపల హృదయంలో ఉన్న ఈశ్వరుడు సమానంగానే ఉంటాడు. హెచ్చు తగ్గులుగా లేడు. ఈశ్వరుడిలో భిన్నత్వం లేదు. నీ ఉపాధిలోనే భిన్నత్వం ఉంది. నీకు ఉపాధి బుద్ధి ఉంది కాబట్టి అందరి హృదయంలో ఉన్న ఈశ్వరుడుని చూడలేకపోతున్నావు. ఈదేహబుద్ధి నశించిన వెంటనే ఉన్న వస్తువు మీకు స్పష్టంగా వ్యక్తమవుతుంది. మీరు జీవితంలో ఏదైనా సాధించిన నాతెలివి వలన సాధించాను అనుకోకండి. దానివలన పొగరుబోతుతనం పెరుగుతుంది. శరీరం మరణించిన తరువాత చీకటి లోకాలకు వెళతారు. కొంత మంది మాటలు కఠినంగా ఉంటాయి.

హితువుగా ఉండవు. ఆమాటల్లో ఏమీ ఉపదేశం ఉండదు, మనకి గాయం తగులుతుంది. కొంతమంది చూపులోనే అసూయ ఉంటుంది. ప్రేమ, కరుణ కనబడవు. మీకు ఇష్టం లేనివారికి అపకారం జరిగితే మీకు సంతోషం వస్తుంది. అంటే అక్కడ అంత:కరణము లేదు. అంత:కరణము లేని సంతోషము వలన భవిష్యత్‌లో మీకు చెడు జరుగుతుంది. అహంకారము దేహం లేకుండా ఉండలేదు కాబట్టి దేహం వస్తుంది. దేహం వస్తే లోకం వస్తుంది. దానికి ఒక ప్రభువు ఉండాలనే భావన వస్తుంది. మోక్షం అంటే మీరు అనుకొన్నంత కష్టం కాదు. మోక్షం పొందడానికి మీశరీరం శవం అయ్యేవరకు ఆగనక్కరలేదు. జాగ్రదావస్థలో మనం ఉన్నాము. అన్న సంగతి మనకి తెలుస్తోంది. కాని సుఖంగాలేముగాఢనిద్రలో సుఖంగా ఉన్నాము. కాని ఉన్నాము అనే సంగతి మనకి తెలియడంలేదు. గాఢ నిద్రలో ఉన్న సుఖం, జాగ్రదావస్థలోఉన్న ఎరుక ఒకేసారి అనుభవించటమే మోక్షం.

లోకానికి సంబంధించిన ఫలితం వచ్చినంత వేగంగా మానవస్వభావం మారదు. తేలికగా మారుతుంది అని మనం ఊహించకూడదు. చాలా కాలం పడుతుంది. బహుజన్మల కృషి వలన గాని, మానవస్వభావంలో మార్పు రాదు. అని భగవంతుడు చెప్పాడు. కర్మ చేస్తాము, దాని వలన ఫలితం వస్తుంది ఆఫలితాన్ని సమాజమునకు గాని భగవంతునికి గాని అర్పించము ఫలితాన్ని మనమే అనుభవిస్తాము. దాని వలన వాసన పుడుతుంది. వాసన నుండి తలంపు వస్తోంది. తలంపును బట్టి మాట వస్తోంది, తలంపును బట్టి పని చేస్తాము. తలంపు వాసన నుండి వస్తోంది కాబట్టి వాసన క్షీణిస్తేనే కాని తలంపు క్షీణించదు. ముందు భక్తిని అలవర్చుకోండి భక్తి ఎందుకు పనికిరానిది అనుకోవద్దు. భగవంతునికి, భక్తునికి ఉన్న అనుబంధమే భక్తి. భగవంతుడే మనకి పెద్దచుట్టం. శరీరం మరణించినప్పుడు భౌతికమైన చుట్టాలతో సంబంధము తెగిపోతుంది. మనకి పెద్ద చుట్టం అయిన భగవంతునిలో ఐక్యం అయ్యేవరకు ఆయన మనలను విడిచిపెట్టడు. ఆయనలో ఐక్యం అయ్యే వరకు ఆయన మీద గౌరవం, ప్రేమ, భక్తి విడిచిపెట్టవద్దు. ఆయనకు ఏపని అయితే ఇష్టమో ఆపని చేయడం నేర్చుకోండి. పని అంటే అదే. మీ అజ్ఞానం యొక్క ప్రేరణతో చేసేది పని కాదు. ఏకర్మ చేస్తే ఈశ్వరుడు సంతోషిస్తాడో అటువంటి కర్మ చేయాలి. వాంఛ ఉన్నవాడికి ఈదేహాన్ని ఇంకా మొయ్యాలి అనిపిస్తుంది. వాంఛ లేని వాడికి దేహంతో పనిలేదు. వాడికి దేహం ఉన్నా, లేకపోయిన ఒక్కటే. నీకు భక్తి పెరగాలి అంటే రోజూ పూజ చేయడమే కాదు,స్తోత్రాలు చేయడమే కాదు. ఈశ్వరుడికి ఇష్టం అయిన పనిని చేతులతో చేస్తూఉండు దాని వలన భగవంతుని అనుగ్రహానికి తొందరగా పాత్రుడవుతావు. మనస్సును విచ్చలవిడిగా విడిచిపెట్టవద్దు. నామనస్సు నా స్వాధీనంలో ఉంటే మీరు నన్ను దు:ఖపెట్టాలన్నా దు:ఖపెట్టలేరు. నా మనస్సు నాస్వాధీసంలో లేకపోతే మీరు నన్ను సుఖపెట్టాలనా సుఖపెట్టలేరు. నీవు అభివృద్ధిలోకి వచ్చినా రాకపోయినా. నీవు వెలుగులోకి వెళ్లినా, చీకటి లోకాలకు వెళ్లినా నీ మ[illegible]స్స కారణం. అందువలన మనోనిగ్రహం అవసరం. మానసిక ఆరోగ్యం అవసరం. శరీరం ఆత్మ కాకపోయినా, మనస్సు ఆత్మకాకపోయినా, తలంపులు ఆత్మకాకపోయినా, మంచి తలంపులు వచ్చేలా చూసుకోవాలి. మంచి మనస్సు ఉండేలా చూసుకోవాలి. శరీరం ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలి. దీనివలన నీహృదయంలో ఉన్న ఈశ్వరుడిని తెలుసుకోవడానికి అవి సహకరిస్తాయి. ఆహారశుద్ధి వలన చిత్తశుద్ధి వస్తుంది. నిద్ర విషయంలో, ఆహార విషయంలో, మాటల విషయంలో తగు మాత్రంగా

ఉండాలి. నీమనస్సును కదలకుండా ఉండమంటే అది కదలకుండా ఉండాలి. అంత కంట్రోలు నీ మనస్సు మీద సాధించాలి. నీవు చేసే సాధన సక్రమంగా చెయ్యి. వస్తువును పొందుతావు. పొందకుండా ఆప్రయత్నంలో మరణించినా నీవు చేసిన సాధన వృధాపోదు, వచ్చే జన్మలోకి వచ్చేస్తుంది. బహుజన్మల కృషి ఉంటేనేగాని నీమొఖం ఆత్మజ్ఞానం వైపుకు తిరగదు. ముడిసరుకును కొనడం తేలిక. కాని ఒక మనిషిని పవిత్రుడిని చేయడం కష్టం. ఎందుచేతననగా మనిషి ముడిసరుకు కాదు. మానవ స్వభావం మారుతుంది. కాని ఎక్కువ కాలం పడుతుంది.

నీకు ఇష్టమైన రూపం తీసుకొని నిరంతరం ధ్యానం చేయి. నామమును నిరంతరము స్మరించు. చేసే పని ప్రేమగా, ఇష్టంగా చేస్తే పాత వాసనలు పోతాయి. కొత్త వాసనలు రావు. ఎక్కడ అయితే ప్రేమ ఉందో, ఎక్కడైతే విశ్వాసం ఉందో అక్కడ మనస్సు తొందరగా సెటిల్ అవుతుంది. ఆదేవుడు ఎక్కువ, ఈదేవుడు తక్కువ అని భేదబుద్ధి పెట్టుకోవద్దు. బేదబుద్ధిపెట్టుకుంటే నీనోట్లో మట్టే. నీవు ఏపని చేస్తున్నా నీమనస్సు ఈశ్వరుడితో తాదాప్యం పొందుతూఉంటే నీవు చేసిన చేయనివాడితో సమానం. ముసలితనం వచ్చినతరువాత అప్పుడు అది చేసాను, ఇది చేసాను అని జరిగిపోయిన గొడవలు చెప్పకుంటూ ఉంటారు. నీవు ఏపని చేసినా అది మరచిపోవాలి. మరచిపోతే ఏమీలేదు. నీవు ఏపని చేసినా మనస్సు ఈశ్వరుడి యందు లగ్నమై ఉంటే నీవు చేసిన మంచి పనికూడా గుర్తుకు రాదు. నీవు చేసే పని నిర్మలంగా చేయి, స్థిరంగా చేయి, చేసి మరచిపోతూ ఉండు. అప్పుడు ఈశ్వరానుగ్రహం కల్గుతుంది. నీకు మోక్షమును ఇస్తాడు. మోక్షంతో పోల్చుకుంటే ఈలోకంలో జరిగే సంఘటనలు బహు చిన్నవి. ఉన్నది ఈశ్వరుడు ఒక్కడే ఈశ్వరుని తెలుసుకునే వరకు నీవు ఉన్నావు, నేను ఉన్నాను అనుకొంటాము. నీఅహంకారంను నీవు విడిచిపెట్టలేకపోయినా ఈశ్వడుని నిరంతరం స్మరిస్తూఉంటే ఆయనే వచ్చి అహంకారాన్ని ఊడగొడతాడు. నీ మనస్సుకు ఈశ్వరుడితోటి సంబంధము ఉంటే అది శుద్ధం అవుతుంది. ఈశ్వరానుగ్రహం అనే ప్రవాహం వచ్చి నీకు దేహగతమైన నేను అంటే ఎంత ఇష్టం ఉన్నా దానిని ఊడగొట్టి నిజమైననేను ను ప్రసాదిస్తాడు. నీచేతిలో ఉన్న పని చిన్నదా పెద్దదా అని కాదు. దానిని నెమ్మదిగా స్థిరంగా చేయి. నీవు ఎంత చేయగలిగితే అంతే చేయి. గొప్పలకోసం చేయవద్దు. ఈశ్వర ప్రీతి కోసం చేయి. ఈశ్వరానుగ్రహం నీకు చెప్పి రాదు. అది ఎప్పడో వచ్చి మిధ్యా నేనును ఊడగొడుతుంది. అప్పడు నిజమైన నేను నీకు వ్యక్తమవుతుంది. అప్పడు రూపాలు, నామాలతో పని లేకుండా మీరు స్వతంత్రముగా ఉండవచ్చు. నిజమైన నేను నీకు వ్యక్తమయ్యేవరకు నీకు సుఖం లేదు, శాంతి లేదు, స్వేచ్ఛ లేదు. గాఢనిద్రలో మన మనస్సు హృదయంలో ఎంత నిర్మలంగా ఉంటుందో, ఎంత సహజంగా ఉంటుందో అలాగ జాగ్రధావస్థలో ప్రయత్నంతో మన మనస్సును హృదయంలో నిర్మలంగా, సహజంగా ఉంచగలిగితే మీకు ఇక్కడే, ఇప్పడే మోక్షం కల్గుతుంది. నీబ్రెయిన్‌కు ఆధ్యాత్మిక హృదయానికి కలిపి ఒక నరం ఉంటుంది. నీ శరీరాన్ని కోసి చూసినా అది కనబడదు. అది ఎప్పడూ మూసుకొని ఉంటుంది. నిరంతర ధ్యానం వలన, నిష్కామకర్మ వలన ఆవత్తిడి వలన అది తెరుచుకుంటుంది. అప్పడు ఒక మహా వెలుగులో ప్రవేశిస్తావు. అప్పడు ఏదీ నిన్ను బంధించదు. అప్పడు సుఖం కోసం నీవు వెదకనక్కర లేదు. నీ స్వరూపమే నీకు సుఖంగా కనిపిస్తుంది. ఆ నరం ఎప్పడు తెరుచుకుంటుందో మనకి తెలియదు. కేవలం మన ప్రయత్నం వలన అది తెరుచుకోదు. మనం ప్రయత్నం చేయాలి, కాలం కలసిరావాలి, ఈశ్వరానుగ్రహం రావాలి. ఏజన్మలో అది

తెరుచుకుంటుందో అదే కడసారి జన్మ.

మనిషి వెంట నీడ వస్తుంది. ఆనీడను నేను అని అనుకోను. అద్దంలో చూసుకుంటే మన ప్రతిబింబము కనపడుతుంది. ఆప్రతిబింబమును నేను అనిఅనుకోను. నీ నీడ మీద, నీ ప్రతిబింబం మీద నీకు నేను అనే బుద్ధి కలుగదు. అదే విధంగా నీదేహం మీద నీకు నేనుఅనేబుద్ధి ఎప్పుడైతే కలుగదో అప్పుడు నీకు మోక్షం వస్తుంది అని ఆచార్యులవారు చెప్పారు. సాధన చేస్తూఉంటారు. పతనమవుతూ ఉంటారు. మరలా సాదన చేస్తాం, పడిపోతూ ఉంటాము. కొద్దిపాటి సాధన కు ఈశ్వరుడు ఆయన అనుగ్రహాన్ని ఇచ్చి నీకు శాశ్వతశాంతిని యిస్తాడు. నీవు చేసే ప్రయత్నం తక్కువ అయినా, ఆయన ఇచ్చేది ఎక్కువ. నా తెలివి వలన అంతా సాధిస్తున్నాను. అని అనుకుంటావు కాని అది వచ్చిన తరువాత ఇది అంతా ఆయన అనుగ్రహమే అని నీకు తెలుస్తుంది. ఆత్మ సుఖాన్ని నీమనస్సుకు కొంచెం కొంచెంగా రుచి చూపిస్తాడు. ఆరుచి చూసాక అది బయటకు విజృంభించడం మాని వేస్తుంది నీ దగ్గర పది రూపాయలు ఉంటే దానిని బయటపడవేయండి అంటే మీరు బయటపడవేయరు. మీకు వంద రూపాయలు ఇస్తానంటే మీరు వెంటనే బయటపడవేస్తారు. అలాగే చైతన్యం తాలూకా శాంతి నీకు అందటం ప్రారంభిస్తే చిన్న చిన్న సుఖాలకు వ్యర్ధమైన కోరికలకు, ఖర్మలకు, తలంపులకు మీకు తెలియకుండానే దూరమవుతారు.

నీ మనస్సు ఎప్పుడైతే ఈశ్వరుడి పాదాలయందు శరణాగతి వేడుకుందో అప్పుడు నీమనస్సు నశిస్తుంది. ఒకేసారి పూర్ణ శరణాగతి సాధ్యం కాదు. కొంచెం కొంచెం చేయాలి. ఒకేసారి పూర్ణశరణాగతి చేయలేకపోతున్నానని మానివేయవద్దు. మీరు చేయగలిగినంత చేయండి. ఒక్కొక్క నీటిబొట్టు పడుతూఉన్నా గంటకో, రెండు గంటలకో బిందె నిండుతుంది. అలాగే కొంత కాలం అభ్యాసం చేసేటప్పటికి పూర్ణశరణాగతి పొందుతారు. నీ సంకల్పమే నాసంకల్పం, అనుకొని నీ సంకల్పాన్ని తీసివేసి భగవంతుని సంకల్పాన్ని నీ సంకల్పం ఉన్న చోట పెడితే నీకు పూర్ణశరణాగతి వస్తుంది. వాడికి మాత్రమే ఈశ్వరుడు తన స్వరూపాన్ని ఇస్తాడు. దేవుడు ఉన్నాడో లేడో నీకు తెలియదు. కాని నేను అనే తలంపు ఉన్నట్టు నీకు తెలుస్తోంది. ఆ నేను అనే తలంపు వచ్చాక ఇతర తలంపులు వస్తున్నాయి. ఆ నేను అనే తలంపు మూలంలోనికి నీవు వెళ్ళితే అది అణిగిపోతుంది. భగవంతుడు ఉన్నాడు అనే పరిపూర్ణమైన విశ్వాసం ఉంటే ఆయనను ప్రేమించు. అంతా ఆయన అనుగ్రహమే. భగవంతుడు ఉన్నాడనే పరిపూర్ణమైన విశ్వాసం వలన నీదోషాల నుండి విడుదల చేసి నా స్వరూపాన్ని నీకు ఇస్తాను అని భగవంతుడు చెప్పాడు. నిరంతరం ఈశ్వరుడిని స్మరిస్తూ పని చేసుకుంటూ ఉంటే అహంభావన యొక్క జోక్యం తగ్గిపోయి అది సన్నగిల్లి రాలిపోతుంది. మనం చేసే పని కుటుంభానికో, సమాజానికో ఉపయోగపడాలి. అదే కాలంలో నీ చైతన్యస్థాయి పెరగాలి. ఒకే పని వలన రెండు లాభాలు రావాలి. ఇవి రెండు ఎలా సాధ్యం అవుతాయి అంటే నీవు నిర్మలంగా పని చేస్తే నిరాడంబరంగా పనిచేస్తే దేహాభిమానం లేకుండా పనిచేస్తే ఒకే కాలంలో రెండు లాభములు వస్తాయి. భౌతికంగా నీవు పని చేసినట్లు అవుతుంది. సమాజానికి సహాయపడినట్లు అవుతుంది. అదే కాలంలో నీ చైతన్యస్థాయి పెరుగుతుంది. బాహ్యమైన వ్యక్తుల మీద గాని, బాహ్యమైన సంఘటనల మీదగాని ఆధారపడకుండా నీవు స్వతంత్రమైన సుఖాన్ని పొందగల్గుతావు.